క్లుప్తంగా

ఆలయాల అభివృద్ధికి విరాళం



విరాళం ఇస్తున్న మహేశ్‌గుప్తా

శివ్వంపేట(నర్సాపూర్): ఆలయాల అభివృద్ధికి మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా రూ.72 వేల విరాళం శుక్రవారం నిర్వాహకులకు అందజేశారు. మండల పరిధిలోని లచ్చిరెడ్డిగూడంలో నూతనంగా నిర్మిస్తున్న బీరప్ప ఆలయానికి రూ. 51 వేలను కురుమ సంఘం నాయకులకు అందజేశారు. ఇదే గ్రామంలో హనుమాన్ ఆలయం ముందు ధ్వజస్తంభం ఏర్పాటుకు రూ.21 వేలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనివాస్, కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, ఆంజనేయులు, రవి, ప్రశాంత్‌రెడ్డి ఉన్నారు.

చిన్నచింతకుంటలో..

నర్సాపూర్ రూరల్: మండలంలోని చిన్నచింతకుంట గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లికార్జునస్వామి ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన మహేశ్‌గౌడ్ రూ. ఒక లక్ష విరాళం ఇచ్చి తన భక్తిని చాటుకున్నాడు. ఆధ్యాత్మికత చింతన ప్రతీ ఒక్కరిలో పెరిగి, అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఉద్దేశంతోనే ఆలయ నిర్మాణానికి సహాయం అందిస్తున్నట్లు మహేష్ గౌడ్ తెలిపాడు.

ఉపాధి కూలీల హాజరుశాతం పెంచాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఉపాధి కూలీల హాజరు శాతం పెంచి, కూలీలు పనులను సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. మండల కేంద్రం చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఆయన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఉపాధి పనుల్లో భాగంగా ఫాంపాండ్, ఫిష్‌పాండ్, మట్టి రోడ్డు పనులు చేయించాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్యలున్న గ్రామాల్లో ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ తిరుపతి, ఏపీఓ శ్యామ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

సన్మానం



కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): సీపీఆర్ ద్వారా వ్యక్తి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుళ్లను బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కొండల్‌రావు ఆధ్వర్యంలో సన్మానించారు. శివ్వంపేట పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు విష్ణువర్ధన్‌రెడ్డి, మహేందర్ బుధవారం అర్ధరాత్రి దేవమ్మగూడంలో రాజు ఉరివేసుకొని కొనఊపిరితో ఉండగా, సీపీఆర్ చేసి బతికించడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం కానిస్టేబుళ్లను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వినోద్ కుమార్, షాబర్తీ గిరి, శేఖర్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక వ్యాపారుల బైండోవర్

తూప్రాన్: మండలంలోని ఆయా గ్రామాల్లో అక్రమంగా ఇసుక ఫిల్టర్ల ద్వారా కృత్రిమ ఇసుక తయారు చేసి, విక్రయిస్తున్న ఏడుగురిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ శివానందం శుక్రవారం తెలిపారు. మండలంలోని కిష్టాపూర్, నాగులపల్లి, గుండ్రెడ్డిపల్లి గ్రామాల్లో అక్రమంగా ఇసుక ఫిల్టర్ల ద్వారా ఇసుక రవాణా చేస్తున్న కిషోర్, విష్ణువర్ధన్‌రెడ్డి, నవీన్, ప్రకాశ్, శ్రీశైలం కిష్టాపూర్, శ్రీశైలం నాగులపల్లి, మధులను స్థానిక తహసీల్దార్ విజయలక్ష్మి ఎదుట బైండోవర్ చేశామన్నారు.

బీజేపీ కిసాన్‌సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా లింగారెడ్డి



నియామక పత్రం అందుకుంటున్న లింగారెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రానికి చెందిన లింగారెడ్డిని బీజేపీ కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం మెదక్ జిల్లా బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లేశం గౌడ్, కిసాన్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ నియామక కాపీని అందించారు. ఈ సందర్భంగా యెన్నం లింగారెడ్డి మాట్లాడుతూ.. తనను కిసాన్‌సెల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించిన జిల్లా నాయకుల నమ్మకాన్ని వమ్ముచేయకుండా రైతుల కోసం నిరంతరం పోరాడుతానని తెలిపారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

- చోద్యం చూస్తున్న అధికారులు
- జేసీబీలతో చెరువుల్లో మనిషి లోతు తవ్వకాలు
- ప్రమాదకరంగా మారుతున్న చెరువులు, కుంటలు



గడిపెద్దాపూర్ పటాన్ చెరువులో జేసీబీతో తవ్వుతున్న మట్టి

అల్లాదుర్గం(మెదక్): అక్రమంగా మట్టి తరలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, ఇరిగేషన్, రెవెన్యూ చెబుతున్న ఎక్కడ అమలు చేయడం లేదు. నిత్యం జేసీబీలతో చెరువుల్లో మనిషి లోతు తవ్వి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. భారీ గుంతలు ఏర్పడటంతో వర్షా కాలంలో నీరు నిండి పశువుల కాపరులు, యువకులు అందులో పడి ప్రాణాలు కోల్పోతున్నారు. అక్రమ మట్టి తవ్వకాలతో చెరువులు ప్రమాదకరంగా మారుతుంటే అధికారులు మాత్రం అటు వైపు కన్నెత్తి చూడటం లేదనే ఆరోపణలున్నాయి. మండల పరిధిలోని గడిపెద్దాపూర్ పటాన్ చెరువులో 15 రోజులుగా అక్రమ మట్టి తవ్వకాలు కొనసాగుతున్నాయి. జేసీబీలతో మట్టి తవ్వకాలు చేపట్టి, 10 ట్రాక్టర్లతో మట్టిని పట్టపగలే తరలిస్తున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. అధికారులు నిర్లక్ష్యం, అక్రమార్కుల మట్టి దందాతో ప్రజల ప్రాణాలకు ముప్పువాటిల్లుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు స్థానికులు సమాచారం ఇస్తే సిబ్బంది అక్కడికి వెళ్లి మాముళ్లు తీసుకొని వదిలి పెడుతున్నారనే విమర్శలు లేకపోలేదు. అల్లాదుర్గం, మందాపూర్, గిరిజన తండాలో పట్టపగలు మట్టి దందా జోరుగా సాగుతోంది. ప్రభుత్వ భూముల్లో, చెరువులు, కుచ్చలను అక్రమార్కులు వదలడం లేదు. ఇప్పటికైనా అధికారులు అక్రమ మట్టి తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గడిపెద్దాపూర్ పటాన్ చెరువులో మనిషి లోతు గుంతలు

చెరువుల్లో మట్టి తవ్వితే క్రిమినల్ కేసులు

చెరువుల్లో మట్టి తవ్వకాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. చెరువులు, కుంటల్లో మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వం. గడిపెద్దాపూర్ పటాన్ చెరువులో మట్టి తవ్వకాలపై మా దృష్టికి వచ్చిందని విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. మట్టి తవ్వకాలతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి, ప్రమాదాలు జరుగుతున్నాయి. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– తిలక్‌రాజ్, అల్లాదుర్గం ఇరిగేషన్ ఏఈ

ఇబ్బందుల్లేకుండా కొనుగోలు చేయండి

ఎమ్మెల్యే సునీతారెడ్డి

కొల్చారం(నర్సాపూర్): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు చేపట్టాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి సూచించారు. శుక్రవారం రంగంపేట పీఏసీఎస్, సంగాయిపేట, ఐకేపీ ఆధ్వర్యంలో వసురాం తండా, వెంకటాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కొబ్బరికాయ కొట్టి ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేశ్ కుమార్, రంగంపేట పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లేశం, ఐకేపీ ఏపీఎం సుశీల్య, సంఘం డైరెక్టర్లు ప్రవీణ్ రెడ్డి, దుర్గేశ్‌గౌడ్, సాయిలు, సీఈఓ నవీన్, సంగాయిపేట మంజీరా రైతు ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మంజుల, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గౌరీ శంకర్‌గుప్తా, పార్టీ యువజన అధ్యక్షుడు సంతోష్ రావు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరలు

నర్సాపూర్ రూరల్: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రెడ్డిపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం చెల్లించే మద్దతు ధర కేవలం కొనుగోలు కేంద్రాల ద్వారనే వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం గౌరీ శంకర్,



నర్సాపూర్ రూరల్: రెడ్డిపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

మాజీ సర్పంచ్ వెంకటేష్ గౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

కొల్చారం(నర్సాపూర్): వరంగల్ ఎలుకతుర్తి కేంద్రంగా ఈనెల 27 జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి కోరారు. శుక్రవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చిన సునీతారెడ్డి సంగాయిపేటలో రజతోత్సవ వాల్ పోస్టర్‌ను మండలాధ్యక్షుడు గౌరీ శంకర్‌గుప్తా, కౌడిపల్లి మండలాధ్యక్షుడు రామాగౌడ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చేలా నాయకులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్, మాజీ ఎంపీపీ మంజుల, మండల యువత అధ్యక్షుడు సంతోష్‌రావు, రంగంపేట గ్రామ కమిటీ అధ్యక్షుడు దుర్గేశ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సురేశ్, శ్రీకాంత్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ విజయోత్సవ ఏర్పాట్లు



చాకరిమెట్లలో కొలువైన ఆంజనేయస్వామి

శివ్వంపేట(నర్సాపూర్): హనుమాన్ విజయోత్సవ దినోత్సవం సందర్భంగా శనివారం ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన చాకరిమెట్ల సహకార ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం ప్రత్యేక పూజ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో హనుమాన్ విజయోత్సవ ర్యాలీను చేపట్టేందుకు భక్తులు ఏర్పాట్లు చేశారు.



విద్యుత్ దీపాలతో ఆలయం

నార్సింగి సర్పంచ్ పదవి ఎస్సీలకు కేటాయించాలి

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి గ్రామ సర్పంచ్ పదవిని ఎస్సీలకు కేటాయించాలని మాలల హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మైసయ్య రాష్ట్ర పంచాయతీరాజ్ మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందించారు. హైదారాబాద్‌లో కలిసి నార్సింగి గ్రామపంచాయతీగా ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎస్సీలకు రిజర్వేషన్ రాలేదన్నారు. ప్రభుత్వం నార్సింగి సర్పంచ్ పదవి ఎస్సీలకు రిజర్వు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీచర్స్ అసోసియేషన్ నాయకుడు కాసాని విఠల్ ఉన్నారు.



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న మైసయ్య

ప్రణాళికలు సిద్ధం చేయండి

తూప్రాన్ ఆర్డీఓ జయచంద్రారెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): యాసంగి పంటల కోతలు దగ్గర పడటంతో వరి ధాన్యాన్ని కొనుగోలు చేయటానికి అనువైన కేంద్రాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని తూప్రాన్ మండల ఆర్డీఓ జయచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం మనోహరాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సాగు దిగుబడిని అంచనా వేసి, దానికి అనుగుణంగా ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఏఓ స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ జయచంద్రారెడ్డి

గుంతలు పూడుస్తున్నాం..

బస్సులు నడపండి

నర్సాపూర్ రూరల్: కొండాపూర్ వయా కాగజ్ మద్దూర్, నత్తయపల్లి రోడ్డుకు ఏర్పడిన గుంతలు పూడుస్తున్నాం.. బస్సులు నడపాలని ప్రజలు కోరారు. కొన్నినెలలుగా నర్సాపూర్ నుంచి పటాన్‌చెరుకు వెళ్లే బస్సులు నిలిపేశారు. దీంతో నిత్యంపై గ్రామాల నుంచి పాఠశాలలు కళాశాలలు, పటాన్‌చెరు, బొల్లారం, జిన్నారం మండలాల్లోని కంపెనీల్లో పనిచేసే కార్మికులు నిత్యం ఈ రోడ్డుపై వందల సంఖ్యలో ప్రయాణం కొనసాగిస్తారు. బస్సులు నిలిపివేయడంతో అనేక మంది ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు ధ్వంసం కావడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, ఇతర వాహనదారులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం కాగజ్ మద్దూర్ గ్రామ పంచాయతీలో ఉన్న స్పెషల్ గ్రాండ్ నిధులు రూ. 2 లక్షలు ఉండడంతో గుంతలలో కంకర వేయిస్తున్నట్లు ఆ గ్రామ మాజీ సర్పంచ్ శివకుమార్, నత్నయ్యపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకుడు ఉదయ్ తెలిపారు. విద్యార్థులను, మహిళలు, వృద్ధులను దృష్టిలో పెట్టుకొని వెంటనే బస్సులు పునరుద్ధరించాలన్నారు.



కొండాపూర్ వయా కాగజ్ మద్దూర్, నత్తయపల్లి రోడ్డులో గుంతలు పూడుస్తున్న గ్రామస్తులు

ఆయిల్ పామ్ సాగుతో ఆదాయం

రేగోడ్(మెదక్): ఆయిల్ పామ్ సాగుతో రైతుల ఆదాయం మరింత పెరుగుతుందని ఉద్యాన అధికారి సంతోష్ అన్నారు. మండలంలోని ప్యారారం గ్రామంలో శుక్రవారం ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు వరి, మొక్కజొన్న, పత్తి పంటల్లో స్వల్పకాలికంగా ఆదాయాన్ని పొందుతున్నప్పటికీ దీర్ఘకాలికంగా రైతు ఆదాయం పెరగాలంటే తప్పనిసరిగా ఆయిల్ పామ్ సాగుతోనే సాధ్యమని తెలిపారు. ప్రభుత్వం డ్రిప్‌కు, మొక్కలకు అధిక మొత్తంలో రాయితీలను ఇవ్వడం వలన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, అధిక విస్తీర్ణంలో ఆయిల్ పామ్ పంట సాగు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పామ్ కంపెనీ ప్రతినిధి జాన్సన్, ఏఈఓ సుభాష్ ఉన్నారు.

భూమి కబ్జాను అడ్డుకున్న అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని మిర్జాపల్లి గ్రామ శివారులోని 112 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు చదును చేసి, ఫెన్సింగ్ ఏర్పాటు చేయగా, రెవెన్యూ అధికారులు దాన్ని తొలగించారు. శుక్రవారం ఆర్ఐ రాజు ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతి లేకుండా ప్రభుత్వ భూమిని చదును చేసినా.. కబ్జా చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో ఫెన్సింగ్ వేసిన నార్సింగికి చెందిన మల్లేశం కంచెను, కడీలను తొలగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మన్నన్ మాట్లాడుతూ.. ప్రభుత్వభూమిని ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



మిర్జాపల్లి శివారులో ప్రభుత్వభూమిలో వేసిన కంచెను తొలగిస్తున్న సిబ్బంది

అందరికీ అధ్యాత్మికత అవసరం

రేగోడ్(మెదక్): అందరికీ అధ్యాత్మికత అవసరమని దుద్యాల సర్వేశ్వరపురి ఆశ్రమ పీఠాధిపతి అంభికా శివయోగి స్వామి అన్నారు. మండల కేంద్రంలో ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయం వద్ద అవాహిత దేవత పూజ, ధాన్యాదివాసం, రుద్ర, గణపతి, నాగ, భైరవ, నందీశ్వర, స్నత్నం, చతుష్ట భళి, చేయాదివాసం, పర్యాయ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివయోగి స్వామి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ శ్రీరాముడి జపం అందరూ చేస్తే ఎంతో పుణ్యం లభిస్తుందని భక్తులకు సూచించారు. భగవంతుడిని స్మరించుకొని నిత్యం రామనామ సంకీర్తనలు, భజనలు చేస్తూ, దైవాన్ని పూజించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు విఠల్‌రావు, వేదపండితులు సుభాష్ జ్యోషి, ప్రభాకర్ జ్యోషి, సాంభశివ మూర్తి, రఘుశర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.



విగ్రహాలను జలాధివాసం చేస్తున్న భక్తులు

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే అని, సమాజ అభివృద్ధిలో మహిళలు భాగస్వామ్యం కావాలనే ఉద్దేశ్యంతో మహిళల విద్యపై ఎనలేని కృషి చేసిన గొప్పవ్యక్తిగా పేరుగాంచారని ఆయన సేవలను కొనియాడారు.



నర్సాపూర్ ఆర్డీఓ కార్యాలయంలో జ్యోతిబా పూలేకు నివాళులు అర్పిస్తున్న ఆర్‌డీఓ, ఉద్యోగులు



తూప్రాన్: కార్యాలయంలో జ్యోతిబా పూలే జయంతి వేడుకల్లో ఆర్డీఓ జయచంద్రారెడ్డి



మెదక్‌జోన్: జ్యోతిబాపూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు నరేందర్



రామాయంపేటలో పూలే విగ్రహానికి నివాళి అర్పించిన బీసీ సంఘాల నాయకులు

రాజ్యాంగ పరిరక్షణ కోసమే పోరాటం

చిన్నశంకరంపేట(మెదక్): రాజ్యాంగ పరిరక్షణ కోసమే కాంగ్రెస్ పోరాడుతుందని కాంగ్రెస్ నాయకుడు బాల్‌రాజ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం నార్సింగి మండలం నర్సంపల్లి, నర్సంపల్లితండాలో జైబాపు–జైబీమ్–జై సంవిధాన్ యోజన పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులతో రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నార్సింగి మండల జైబాపు–జైబీమ్–జై సంవిధాన్ యోజన కార్యక్రమ ఇన్‌చార్జి రాజాగౌడ్, నార్సింగి మండల నాయకులు రాజేందర్‌రెడ్డి, రాజేష్, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బద్దారం, గొట్టిముక్కులలో..

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా గ్రామాల్లో జైభీమ్, జైసంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ యాత్ర కొనసాగుతోంది. శుక్రవారం మల్కాపూర్, బద్దారం, గొట్టిముక్కుల గ్రామాల్లో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మధు, నాయకులు నారాగౌడ్, సంగమేశ్వర్, రవీందర్ తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

◆ చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ

నర్సాపూర్: ఇద్దరి స్మారకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రంలో శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు. దివంగత నర్సింహారెడ్డి, సంతోష్‌ల స్మారకార్థం వారి కుటుంబీకులు, మిత్రులు పట్టణంలోని చౌరస్తాలో ఇటీవల చలివేంద్రం ఏర్పాటు చేసి, ప్రజలకు చల్లటి నీరు పంపిణీ చేస్తున్నారు. శుక్రవారం సంతకు వచ్చే ప్రజలకు చలివేంద్రం వద్ద నిర్వాహకులు మజ్జిగ పంపిణీ చేశారు.

◆ సన్మానం

చేగుంట(తూప్రాన్): గ్రూప్ 1 రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించిన జూనియర్ అసిసెంట్ ప్రణయ్‌కు శుక్రవారం సన్మానించారు. చేగుంట తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ప్రణయ్ ఇటీవల గ్రూప్ 1 ఫలితాల్లో రాష్ట్ర స్థాయి 17వ ర్యాంకు సాధించారు. దీంతో తహసీల్దార్ శ్రీకాంత్ సిబ్బందితో కలిసి ప్రణయ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరంజ్యోతితో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

◆ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మెదక్ మున్సిపాలిటీ: ఫొటోలో కనిపిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం మెదక్‌లోని గోస ముద్రం చెరువులో శుక్రవారం లభ్యమైనట్లు మెదక్ పట్టణ సీఐ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. కావున పై ఫొటోలో ఉన్న మృతదేహాన్ని ఎవరైనా గుర్తు పట్టినచో ఈ కింద తెలిపిన 8712657878, 87126 57913 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు.

◆ అంబేద్కర్ విగ్రహానికి మరమ్మతులు

నర్సాపూర్: పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి శ్రీపాద ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం మరమ్మతులు చేయించినట్లు ట్రస్టు చైర్మన్ శ్రీధర్‌గుప్తా అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లల పార్కులోని అంబేద్కర్ విగ్రహానికి పలుచోట్ల మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందని గుర్తించి మరమ్మతులు చేయించినట్లు చెప్పారు. శనివారం రంగు సైతం వేయిస్తానని, అంబేద్కర్ జయంతిన ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్ల పంపిణీ చేస్తానని వివరించారు.

◆ సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

చేగుంట(తూప్రాన్): మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో పలువురికి బీజేపీ నాయకులు శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా టెలికాం బోర్డు మెంబర్ మాజీ సర్పంచ్ బాలచందర్ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు జ్ఞానేశ్వర్, సోషల్‌మీడియా కోకన్వీనర్ నాగరాజు, వేణు, రమేశ్, కాంతారావు, మురళి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ ఇరుముడితో హనుమాన్ భక్తుల పాదయాత్ర



తూప్రాన్: హనుమాన్ భక్తులు ఇరుముడితో పట్టణంలోని పెద్ద చెరువుకట్టపై వీరాంజనేయస్వామి ఆలయం నుంచి శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్ర ఆలయ అర్చకుడు ఆత్రేయ శర్మ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన రహదారిపై కొనసాగింది. భక్తులు భక్తిశ్రద్ధలతో హనుమాన్ పాటలతో పాదయాత్ర చేశారు. శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయంలో విశేష పూజ కార్యక్రమాలతో పాటు మాల విరమణ, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నాట్లు ఆత్రేయశర్మ పేర్కొన్నారు.

◆ కాళ్లకల్ మజీద్‌కమిటీ సదర్‌గా గులాం

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ గ్రామ మైనార్టీల సంఘంను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ మజీద్‌లో ముస్లింలు ఏకగ్రీవంగా నూతన అధ్యక్షుడిగా (సదర్)గా దూదేకుల గులాంను, నాయిబ్ సదర్‌గా రఫత్‌పాషా, క్యాషియర్‌గా అజ్జులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మజీద్ అభివృద్ధికి, గ్రామ మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు.